క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవ స్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



నల్లకాల్వలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ

ఆత్మకూరు: త్వరలో జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఆత్మకూరు సీఐ నాగభూషణంయాదవ్ కోరారు. మండలంలోని నల్లకాల్వ, బాపనంతపురం, కొత్తరామాపురం గ్రామాల్లో గురువారం పోలీసు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా వినియోగించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి, బీఎస్ఎఫ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

నూతన పైపులైన్ నిర్మాణం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ముస్లిం మైనార్టీ కాలనీకి నూతన పైపులైన్ నిర్మాణం చేపట్టినట్లు సర్పంచు వరప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నుంచి నీటి సరఫరాకు పైపులైన్ దెబ్బతినడంతో సమస్య ఏర్పడిందన్నారు. పరిష్కారం కోసం వెంటనే కొత్త పైపులైన్ ఏర్పాటు, అలాగే ట్యాంకు వద్ద తుప్పు పట్టిన వాల్వ్ స్థానంలో కొత్త వాల్వ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

కాలినడకన తిరుమలకు

పాములపాడు: భక్తులు గురువారం తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రంలో తిరుమలేశుని దర్శనార్థమై కాలినడకన బయల్దేరారు. 3 సంవత్సరాలుగా మండలంలోని రుద్రవరం, లింగాల, ఇస్కాల, పాములపాడు, జూపాడుబంగ్లా మండలంలోని రామసముద్రం, కొత్తపల్లి మండల కేంద్రం నుంచి 50 మంది భక్తులు స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమం నుంచి బయలుదేరారు.

203 మందికి 'ఈబీసీ నేస్తం'

జూపాడుబంగ్లా: మండలంలోని రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమ కులాలకు చెందిన 203మంది లబ్ధిదారులకు ఈబీసీ పథకం వర్తించినట్లు ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బనగానపల్లెలో నిర్వహించిన సభలో ఈబీసీ పథకం కింద 45ఏళ్ల నుంచి 60ఏళ్లలోపు వయస్సున్న ఈబీసీ కులాలకు చెందిన మహిళలకు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. జూపాడుబంగ్లా మండలానికి రూ.30,45,000ల నగదు మంజూరైనట్లు వెల్లడించారు.

టీడీపీ అభ్యర్థిగా జయసూర్య

నందికొట్కూరు: తెలుగు దేశం పార్టీ నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా గిత్తా జయసూర్యను గురువారం నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈయన స్వ గ్రామం నందికొట్కూరు మండలం అల్లూరు. గిత్తా గాంధీ, సులోచనమ్మ దంపతుల కుమారుడు గిత్తా జయసూర్య. భార్య అంగన్‌వాడీ టీచర్, ఇద్దరు కుమారులు సంతానం


ఏఆర్‌టీ మందుల పంపిణీ

శ్రీశైలంప్రాజెక్ట్: హెచ్ఐవీ బాధితులకు గతంలో జిల్లా కేంద్రమైన నంద్యాలలో ఏఆర్‌టీ మందులను పంపిణీ చేసేవారు. నంద్యాలకు శ్రీశైలం మండలం సుదూరంగా ఉండడంతో వారికి అవసరమైన మందులను గురువారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అందజేశారు. సీడీ-4, వైరల్ లోడ్ పరీక్షలను కూడా నిర్వహించారు. హెపటైటిస్-బి సోకిన వారికి బూస్టర్ డోస్‌లను వేశారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ప్రోగ్రాం మేనేజర్ ఆలీహైదర్, ఎఆర్‌టీ డేటా మేనేజర్ సరిత, ఫార్మాసిస్ట్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

మిడుతూరు: మండలపరిధిలోని నాగలూటి గ్రామానికి చెందిన వడ్డె రామాంజనేయులు అనే వ్యక్తి గ్రామంలో సారా విక్రయిస్తుండగా సమాచారం మేరకు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నామని ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. అతని వద్ద 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

నృత్య నీరాజనం



శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీశైల ఆలయ దక్షిణమాఢ వీధిలోని నిత్యకళావేదికపై కడపకు చెందిన సాయి నటరాజ డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. మహాగణపతిం, భో..శంభో, శివతాండవం, హర హర శంభో, ఓం నమఃశివాయ, అఖిలాండేశ్వరి తదితర గీతాకు చిన్న, విజయ, శిరీష, చిట్టి, తేజు తదితరులు నృత్యం ప్రదర్శించారు.

బిజినవేముల.. అభివృద్ధి బిరబిర

- దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామం
- వైఎస్సార్‌సీపీ వచ్చాక నాలుగున్నరేళ్లలో రూ.3.15 కోట్లతో అభివృద్ధి పనులు
- పూర్తయిన సీసీ రోడ్లు, డ్రైన్లు, పైపులైన్ పనులు
- గ్రామ సచివాలయంతో ప్రజలకు చేరువైన సేవలు





గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ప్రారంభమైన ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌లు

నందికొట్కూరు రూరల్: మండలంలోని బిజినవేముల గ్రామం కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గ్రామంలో అభివృద్ధి పరుగులుపెడుతోంది. గ్రామంలో రూ.3.15 కోట్లతో అంతర్గత, ప్రధాన రహదారులు, డ్రైనేజీల నిర్మాణం జరిగింది. ఎంతో కాలంగా సమస్యగా ఉన్న మంచి నీటి కొరత తీర్చేందుకు గ్రామంలో పైపులైన్ల నిర్మాణం పూర్తయ్యింది.



గ్రామానికి చేకూరిన లబ్ధి..

ఒక్క బిజినవేముల గ్రామంలో 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు వివిధ సంక్షేమ పథకాల కింద (డీబీటీ) రూ. 10,51,18,220లు, నాన్ డీబీటీ కింద రూ.5,06,67180 లు ప్రజల ఖాతాల్లో నేరుగా జమ అయ్యాయి. అభివృద్ధి పనులకు మరో రూ.3.15 కోట్లు కేటాయించడంతో గ్రామం ప్రగతి పథంలో దూసుకెళ్తోంది. అమ్మ ఒడి పథకం కింద 288 మంది లబ్ధిదారులకు రూ. 1,35,18,460 అందాయి. విద్యాదీవెన కింద 171 మందికి రూ.46,12,190 అందాయి.

గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు

గ్రామంలో రూ.43.50లక్షలతో నూతన సచివాలయం, రూ. 23.9లక్షలతో ఆర్‌బీకే, రూ.20.80లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు. వీటిని కొద్ది రోజుల క్రితం ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రారంభించారు. నాడు- నేడు పథకం కింద గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌కు రూ.45 లక్షలతో కాంపౌండ్ వాల్, పాఠశాల అభివృద్ధికి రూ.42లక్షలు కేటాయించి పనులు చేపట్టారు. ఉర్దూ పాఠశాలకు రూ.12 లక్షలు, ప్రాథమిక పాఠశాలకు రూ.18లక్షలు కేటాయించి అభివృద్ధి పనులతో పాటు మౌలిక వసతులు కల్పించారు. ఇక గ్రామంలో సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ.55 లక్షలు, కాంక్రీట్ డ్రైన్‌కు రూ.10లక్షలు, జల్‌జీవన్ మిషన్ తాగునీటి పైపులైన్ పనులకు రూ.50 లక్షలు కేటాయించి పనులు పూర్తి చేశారు. రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో గ్రామ సర్పంచ్ రవి యాదవ్ అధ్వర్యంలో పట్టణానికి దీటుగా గ్రామంలో అభివృద్ధి సాధ్యమయ్యిందని గ్రామస్తులు చెబుతున్నారు.



నాడు: గ్రామంలోని ఎస్సీ కాలనీ రహదారి దుస్థితి



నేడు: నూతనంగా వేసిన సీసీ రహదారి

గతపాలకులు పట్టించుకోలేదు



బిజినవేముల గ్రామం అభివృద్ధిని గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. పదే పదే అడిగినా పట్టించుకునే వారు కాదు. అలాంటిది గత నాలుగున్నరేళ్లలో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల నిర్మాణం జరిగింది. సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి జరిగింది.

– బుడ్డన్న, గ్రామస్తుడు

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు



గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ప్రభుత్వ పథకాల అర్హులను గుర్తించడంలో వలంటీర్లు బాధ్యతగా వ్యవహరిస్తున్నారు. సచివాలయాల ద్వారా అందరికీ త్వరిత గతిన ఇంటి వద్దకే సేవలు అందుతున్నాయి. పనుల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిన పని తప్పింది. – శివలింగం, గ్రామస్తుడు

గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి



గ్రామంలో గతంలో లేనంత అభివృద్ధి కేవలం నాలుగున్నరేళ్లలో జరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గ్రామంలోని అన్ని వీధులో పనులు చేపట్టాం.

– రవియాదవ్, గ్రామ సర్పంచ్

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్



సీఎంఆర్ఎఫ్ చెక్కులతో సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: పేదలకు సీఎం సహాయనిధి వరమని, పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఏపీ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహానంది, బండిఆత్మకూరు మండలాలకు చెందిన 68 మంది లబ్ధిదారులకు గురువారం నంద్యాలలోని పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్నారంటే చాలు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనేత శిల్పా కార్తీక్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, కొమ్మా మహేశ్వర రెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



విద్యార్థినులచే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాములపాడు: బాల్యవివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత ప్రభావతి అన్నారు. గురువారం స్థానిక ఏఎస్ఆర్ జెడ్పీహెచ్ స్కూలులో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులచే ర్యాలీ, స్కూలులో మానవహారం నిర్వహించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల ప్రాథమిక పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావనిరెడ్డి ఆధ్వర్యంలో బేటీ పఢావో-బేటీబచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు.

మహానంది: బండిఆత్మకూరులోని కస్తూర్బా పాఠశాలలో చిరుధాన్యాలు, పోషకాహారాలపై ఐసీడీఎస్ సీడీపీఓ లీలావతి అవగాహన కల్పించారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని వడ్డెమాను జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు బేటీ బచావో బేటీ పఢావో పై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ అవగాహన కల్పించారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి

కొత్తపల్లి: సమాజంలో మహిళల పాత్ర కీలకమని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ తిరుపతయ్య, సీడీపీఓ కోటేశ్వరమ్మ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందినప్పుడు కుటుంబం కూడా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ మంగవల్లి, ఏపీవో రేష్మ, గోకవరం వైద్యాధికారి జుబేదా, వెలుగు సీసీ రత్నకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యం చూపితేనే కొలువులు

వెలుగోడు: పోటీ ప్రపంచంలో విద్యతోపాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యం ఉంటేనే కొలువులు దక్కుతాయని భారత్ అకాడమీ డైరెక్టర్ గోపికృష్ణ అన్నారు. రేగడగూడురు గ్రామంలో సీఎస్ఐ యూత్ ఆధ్వర్యంలో విద్యా, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గోపికృష్ణ మాట్లాడుతూ.. ఇంటర్మీడియెట్ తరువాత విద్యార్థులు తీసుకునే నిర్ణయాలపై భవిష్యతు ఆధారపడి ఉంటుందని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంజినీరింగ్ కోర్సుల్లో మార్పులు జరుగుతున్నాయి. నేటి కాలంలో మల్టీ స్పెషలైజేషన్ కోర్సులు చేసిన వారికి ఎక్కువ అవకాశాలు, అత్యధిక ప్యాకేజీతో కొలువులు వస్తున్నాయి. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ బాలరాజు, తెలుగు టీచర్ మౌలాలి, సీఎస్ఐ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ వెలుగులు



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ యుగంధరరెడ్డి

మిడుతూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ వారి కుటుంబాల్లో సంక్షేమ వెలుగులు నింపుతున్నారని జెడ్పీటీసీ యుగంధర రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మిడుతూరులో ఇంటి స్థలాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవానికి సొంత ఇల్లును నిర్మించి లబ్ధిదారులకే హక్కు పత్రాలను అందించిన ఘనత జగనన్న కే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, నాయకులు రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా నిర్మాణానికి రూ.26లక్షలు మంజూరు

మహానంది: బుక్కాపురం గ్రామంలో నూతనంగా ఈద్గా, కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం మైనార్టీ సంక్షేమశాఖ నుంచి రూ.26లక్షలు మంజూరైనట్లు వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మీనరసమ్మ, సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ తెలిపారు. నిధుల విడుదలకు సంబంధించి ప్రభుత్వ సెక్రటరీ కె.హర్షవర్ధన్‌రెడ్డి జీఓ విడుదల చేశారన్నారు. గురువారం వారు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి గ్రామానికి వచ్చిన సందర్భంగా ముస్లింలు ఆయనను కలిసి ఈద్గా నిర్మాణం, కాంపౌండ్ వాల్ కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారన్నారు. దీంతో స్పందించిన ఆయన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు నిధులు విడుదల చేయించడంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- ప్రాతకోటలో గోదాములు ప్రారంభించిన కేడీసీసీ చైర్‌పర్సన్ విజయమనోహరి
- హాజరైన పార్టీ ఇన్‌చార్జ్ దారా సుధీర్



రిబ్బన్ కట్ చేసి గోడౌన్‌ను ప్రారంభిస్తున్న కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విజయమనోహరి, చిత్రంలో సిద్ధార్థరెడ్డి, దారా సుధీర్

పగిడ్యాల: రైతుల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. మండలంలోని తూర్పు, పడమర ప్రాతకోట గ్రామంలో నిర్మించిన బహుళ సౌకర్య ప్రయోజన గోదాముల ప్రారంభోత్సవానికి గురువారం సాయంత్రం 6.30 గంటలకు విచ్చేసిన రాష్ట్ర ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విజయమనోహరి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దారా సుధీర్‌లకు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మండల సచివాలయ కన్వీనర్ రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అభిమానులు పెద్ద ఎత్తున తరలి రాగా వినాయక గుడి నుంచి తూర్పు ప్రాతకోట వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పురోహితులు జగదీశ్వరయ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా కేడీసీసీ చైర్‌పర్సన్ రిబ్బన్ కట్‌చేసి గోదాములను ప్రారంభించారు. నాబార్డు నిధులతో రూ. 3.37 కోట్ల వ్యయంతో 1000 మెట్రిక్ టన్నులు, 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో తూర్పు, పడమర ప్రాతకోటలో గోదాములు నిర్మించినట్లు శాప్‌చైర్మన్ తెలిపారు. ప్రాతకోటతోపాటు ముచ్చుమర్రి, పగిడ్యాల, నెహ్రూనగర్ గ్రామాల్లో నిర్మించిన గోదాముల్లో రైతులు పంట ఉత్పత్తులను నిల్వ చేసుకుని అధిక ధరలకు విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సహకార సొసైటీ చైర్మన్ పర్వతరెడ్డి గారి శ్రీనివాసరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి, సచివాలయ కన్వీనర్ రమేష్‌నాయుడు, కోఆప్షన్ సభ్యుడు అస్లాంబాషా, సొసైటీ డైరెక్టర్ దివాన్ సాహెబ్, సీఈఓ ఖాజామొహిద్దీన్, పార్టీ నాయకులు అంబటి శివశంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, భూషిరెడ్డి, విజయ్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు సంతమార్కెట్ వేలాలు

కొత్తపల్లి: మండల కేంద్రంలోని సంతమార్కెట్‌లో సంతజరుపుకొనుటకు అనుమతి కోసం శుక్రవారం నిర్వహించే వేలంపాటను గ్రామప్రజలు, వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామి గురువారం ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామపంచాయతీకి చెందిన సంతమార్కెట్, రెండు రూములకు 2024-25 సంవత్సరానికి గాను 15న ఉదయం 11 గంటలకు సచివాలయంలో వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు.

పిచ్చి కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం గ్రామంలోని ఎస్సీ కాలనీ రస్తాలో వెళ్తున్న బోనాల రాజేష్, కనకం పక్కీరమ్మలపై వేర్వేరు ప్రాంతాల్లో పిచ్చి కుక్క దాడి చేసింది. కాలనీ వాసులు వీరిని వెంటనే వెలుగోడు మండలంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్సలు నిర్వహించి, పరిస్థితి విషమించిన బోనాల రాజేష్‌ను నంద్యాలకు తరలించారు. అదే కుక్క పలు వీధి కుక్కలను కూడా కరిచిందని గ్రామస్తులు తెలిపారు.


ఉదయాన్నే పనుల్లోకి వెళ్లాలి

పాములపాడు: ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉపాధి హామీ పథకం పనుల్లోకి త్వరగా వెళ్లాలని ఎంపీడీఓ సరస్వతి అన్నారు. గురువారం మండలంలోని లింగాల గ్రామంలో చెక్‌డ్యాంలో జరుగుతున్న పూడిక తీత పనులను పరిశీలించారు. కూలీల హాజరుపట్టిని, మస్టర్‌లను పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే ఒకొక్కరికి రూ.254 వేతనం వస్తుందని వివరించారు. వెంట ఏపీఓ విమలమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం సత్వరమే లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డాక్టర్ స్వామినాథన్ సిఫార్సు ప్రకారం రైతులకు చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం ధర్నా నిర్వహించారు. నాయకులు రణధీర్, స్వామన్న, స్వాములు, వెంకటరమణ పాల్గొన్నారు.

వేదపండితులకు గురువైభవోత్సవం అవార్డులు



పీఠాధిపతి నుంచి అవార్డు అందుకుంటున్న వేద పండితులు నాగేశ్వరశర్మ, రవిశంకర అవధాని

మహానంది: మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి గురువైభవోత్సవంలో భాగంగా మహానంది దేవస్థానం వేదపండితులు చెండూరి రవిశంకర అవధాని, నౌడూరి వెంకటదుర్గా నాగేశ్వరశర్మలకు మంత్రాలయం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుధేంద్రతీర్థ స్వామి గురువారం రాత్రి అవార్డులు ప్రదానం చేశారు. మంత్రాలయంలోని యోగీంద్ర మండపంలో గురువైభవోత్సవం-2024 అవార్డుల అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

జగనన్నతోనే మహిళా సాధికారత



సీఎం వైఎస్ జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు, చైర్మన్

నందికొట్కూరు: మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో వైఎస్సార్ నాల్గో విడత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు మెగా చెక్కును అందజేశారు. సీఎం వైఎస్ జగనన్న చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి మహిళలు సంబరాలు జరుపుకున్నారు. మళ్లీ జగనన్ననే సీఎం కావాలంటూ నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో మహిళలకు రుణాలు మాఫీ చేస్తానని చంద్రబాబు నాయుడు మోసం చేశారన్నారు. 600లకు పైగా మోస పూరిత హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకు దక్కిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 2648 గ్రూపులకు గాను రూ, 4. 96 కోట్లు మహిళల బ్యాంకు ఖాతాలో జగనన్న ప్రభుత్వం జమ చేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, మెప్మా సీఎంఎం శాంతకుమారి, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు హమీద్, లాలు, సురేష్, చాంద్‌బాషా, నాయబ్, కృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు అబుబక్కర్, స్థానిక నాయకులు రవీంద్రారెడ్డి, రమేష్, శాలు, సన్న అబ్దుల్లా, కుర్వ శ్రీను, రజినీకుమార్‌రెడ్డి, ఆర్ట్ శ్రీను పాల్గొన్నారు.

కార్మికోద్యమ పితామహుడు కారల్‌మార్క్స్

జూపాడుబంగా/ఆత్మకూరు/శ్రీశైలంప్రాజెక్ట్: : కార్మికోద్యమ పితామహుడు కారల్‌మార్క్స్ అని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ 141 వర్ధంతిని నిర్వహించారు. ఆత్మకూరులోని సుదర్శనవర్మ భవనంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏసురత్నం, రణధీర్ ఆధ్వర్యంలో, సున్నిపెంటలోని భగత్‌సింగ్ కాలనీలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ నాయకులు వై ఆశీర్వాదం ఆధ్వర్యంలో కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

పర్సు అప్పగింత

మహానంది: తూర్పు గోదావరిజిల్లా రాజోలు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం మహానందికి వచ్చారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి దర్శనం అనంతరం ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగా పర్సు పోగొట్టుకున్నారు. బయటికి వచ్చిన తర్వాత గుర్తించి.. విషయాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు వెంటనే సీసీ కెమెరాల పర్యవేక్షకుడు శివాచారి చేత క్షుణ్ణంగా పరిశీలించి భక్తులను గుర్తించి పర్సును బాధితులకు అందించారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహిద్దాం

కొత్తపల్లి: ఈనెల 18వ తేదీ నుంచి మండలంలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాద్దామని ఎంఈఓలు శ్రీరాములు, ఈనాయతుల్లా అన్నారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షల నిర్వహణపై అధికారులు ఇబ్రహీం, రఘుస్వామిల ఆధ్వర్యంలో ఇన్విజిలేటర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.


నూతన ధర్మకర్తల మండలి నియామకం

కొత్తపల్లి: మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి నూతన ధర్మకర్తల మండలిని నియమించినట్లు ఈఓ కార్తీక్ గురువారం తెలిపారు. ఆలయన నూతన ధర్మకర్తల మండలిలో చైర్మన్‌గా బాలుసాని శ్రీనివాసరెడ్డి, సభ్యులుగా బంగి రాజు, పీ.నాగేంద్రమ్మ, దుద్యాల హరిత, కర్నాటి ఈశ్వరయ్య, జి.తిరుపతయ్య, ఎస్.బాలసుబ్రహ్మణ్యంలను నియమిస్తూ దేవదాయ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయని చెప్పారు.

16న అంకాల పరమేశ్వరి దేవి తిరునాల

వెలుగోడు: మండల పరిధిలోని వేల్పనూరు గ్రామంలో స్వయంభుగా వెలసిన అంకాల పరమేశ్వరీ దేవి తిరునాలను ఈ నెల 16న వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఉదయం 8.00 నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ జరుగుతుందని, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రషీద్, కౌన్సిలర్లు

ఆత్మకూరు: మున్సిపాలిటీ అభివృద్ధే తమ లక్ష్యమని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రషీద్, వార్డు సభ్యులు విజయచౌదరి అన్నారు. పట్టణంలోని 6వ వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధుల కింద నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారిఫ్ ఆదేశాల మేరకు ఈ వార్డులో వర్షాకాలం ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ అహమ్మద్‌రసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు రషీద్, ఖుద్దూస్, తిమోతి, షఫీ, షాకీర్, హుసేన్ పాల్గొన్నారు.